

వివరాలు మెయిన్‌లో

**హత్య కేసులో 8 మంది నిందితుల అరెస్టు**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 11 డిసెంబరు , 2025 | పేజీలు : 06


## నేడు తొలి విడత

# ‘పంచాయతీ’ షురూ



### పంచాయతీ ‘తొలిపోరు’కు సర్వం సిద్ధం

### నేడు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్

### సాయంత్రంలోగా ఫలితాలు వెల్లడి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : గ్రామ పంచాయతీ తొలిపోరుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 8 మండలాల పరిధిలో 159 గ్రామ పంచాయితీలకు 1442 వార్డులకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 152 గ్రామ సర్పంచ్, 1244 వార్డులకు గురువారం (నేడు) ఎన్నికలు జరగనున్నాయి. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత ఎన్నికలు తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ మండలాల్లోని 159 గ్రామ పంచాయితీలకు సర్పంచ్, 1442 వార్డు మెంబర్ల ఎన్నికకు పోలింగ్ జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డులకు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటిని మినహాయించగా 152 గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, 1244 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ మొదలై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగియనుంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సాయంత్రంలోపు ఆయా గ్రామాల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల పేర్లను అధికారులు అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం స్టేజ్ 1 ఆర్‌ఓలుగా 52 మంది, స్టేజ్ 2 ఆర్‌ఓలుగా 178 మంది, 16 ఎఫ్‌ఎస్‌టి బృందాలు, 28 మంది జోనల్ అధికారులు, 65 రూట్లు 1686 మంది ప్రిసైడింగ్, 2260 మంది ఇతర ప్రెసిడెంట్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ 18 గుర్తింపు కార్డులకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఓటర్ గుర్తింపుకార్డుతోపాటు రేషన్, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులను ఓటర్లు తమ వెంట తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకపోవల్సి ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎన్నికలు జరిగే 8 మండలాల పరిధిలో బుధవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

**ఐదు అంచెల పోలీస్ భద్రత...**

**264 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తింపు**

తొలి విడత పోలింగ్ జరుగుతున్న ఎనిమిది మండలాల పరిధిలో ఐదు అంచెల భద్రతను పోలీసులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూతుల వద్ద, పోలింగ్ లొకేషన్‌ల వద్ద, 100 మీటర్ల పరిధి, 200 మీటర్ల పరిధిలో, స్ట్రైకింగ్ ఫోర్సు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎన్నికల నియమావళి అమలు టీమ్స్, రూట్ మొబైల్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 264 సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసు అధికారులు గుర్తించారు. ఈ ఎన్నికల్లో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, ఏనిమిది మంది డిఎస్‌పిలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 50 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులు కలిపి మొత్తం 1500 మందితో భారీబందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఆన్‌లైన్ వెబ్‌కాస్టింగ్ ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా ఈ కేంద్రాలలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, సిసి కెమెరాలు, కెమెరాలతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు.

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14మండలాలలో 296 సర్పంచ్‌లు.. 2,491వార్డులు

**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామ పంచాయతీ తొలి విడత పోలింగ్ తొలి తీర్పు గురువారం వెలువడునున్నది. పంచాయతీల్లో మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. జిల్లాలోని నల్లగొండ, చండూరు డివిజన్ లోని 14 మండలలో చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కెట్ పల్లి, శాలిగౌరారం,తిప్పర్తి మండలాలలోని 318 పంచాయతీల్లో సర్పంచులకు,వార్డు సభ్యులకు 2870 పోలింగ్ కేంద్రాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.ఇప్పటికే నామినేషన్ ఉపసవరణ గడువు రోజు 22 సర్పంచి పదవులు, 375 వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది మిగిలిన 296 పంచాయతీలకు, 2491 వార్డు సభ్యులకు ఎన్నిక జరగనుంది. సర్పంచి పదవులకు 966 మంది, వార్డు సభ్యులకు 5,934 మంది పోటీ పడుతున్నారు.ఇందుకుగాను పిఓ ఓపిఓ లు రెండవ ఓ పి ఓ మొత్తం కలుపుకొని 7892 మందిని విధులు నిర్వహించే విధంగా రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందు లో పిఓలు 3444,ఓపిఓలు 4448 మంది ఈ ర్యాండమైజేషన్ లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు.

### ఉదయం పోలింగ్..మధ్యాహ్నం లెక్కింపు

గురువారం ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగుతుంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/వలిగొండ** : స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని అభ్యర్థుల గెలుపుకై కాంగ్రెస్ నాయకులు సైనికుల వలే పనిచేయాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని సోమారం, పైల్వాన్‌పురం, సుంకిశాల, పులిగిల్ల, మొగిలి పాక, తుర్కపల్లి, లింగరాజు పల్లి గ్రామాలలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థుల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైద్య విధాన పరిషత్ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన సేవలు అందిస్తున్న వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏరియా ఆసుపత్రి ఉద్యోగులు సూపరింటెండెంట్ డాక్టర్ రంగయ్యకు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ నెలనెలా వేతనాలు అందించాలని, ట్రెజరీ సాలరీస్ పరిధిలోకి తీసుకురావాలని, సెకండరీ హెల్త్ సర్వీసెస్‌ను బలోపేతం చేయాలన్న నిర్ణయానికి అనుగుణంగా శాస్త్రీయంగా సిబ్బంది సంఖ్యను ప్రతిపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు.



## అభివృద్ధికి నిదర్శనం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని నిదాన్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నారపాక మాధవియాదయ్యను ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, పాలకవర్గ సభ్యులను ఆయన శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు మెచ్చి ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వస్తున్నారనడానికి ఈ ఏకగ్రీవ ఎన్నికలే నిదర్శనమన్నారు.

## నిస్వార్థంగా పనిచేస్తా



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు నిస్వార్థంగా పనిచేస్తానని కప్రాయిపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మక్తాల సైదమ్మ గోవర్థన్ గ్రామ ఓటర్లను కోరారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తూ గ్రామ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించే తనకూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డు మెంబర్లకు కేటాయించిన గుర్తులపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన వార్డు మెంబర్ అభ్యర్థులతో కలిసి గడపగడపకు ప్రచారం నిర్వహించారు.

## బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** పంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. వలిగొండ మండల సంగెం, వర్కట్పల్లి, జాలు కాలువ, నాగారం, లింగరాజుపల్లి గ్రామాలలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులు బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## అంకితమై పని చేస్తా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే పెద్దగూడెం గ్రామ ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేసి అగ్ర పథాన నిలుపుతానని ఆ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఫక్కీరు ఇందిరా సుధాకర్ రెడ్డి ఓటర్లను కోరారు. కొన్ని రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తనను సర్పంచిగా గెలిపించాలని బుధవారం గడపగడపకు తిరుగుతూ గతంలో గ్రామ సర్పంచ్‌గా చేసిన అభివృద్ధిని గ్రామ ప్రజలకు గుర్తు చేస్తూ మరోసారి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.



## ఆర్ఎంఒకు జీతాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేత



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** వైద్యవిధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసి ట్రెజరీ సాలరీస్ పరిధిలోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామూహిక వినతిపత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏరియా హాస్పటల్ తుంగతుర్తి ఉద్యోగులు ఆర్ఎంఓ డాక్టర్ ఉపేందర్ ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గతంలోనే వైద్య విధాన పరిషత్ ఉద్యోగ సంఘాలన్ని కలిసి జెఏసిగా ఏర్పడి చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేస్తూ అందుకు అనుగుణంగా ఒక కమిటి కూడా ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటి అవసరమైన విధి విధానాలను సూచిస్తూ తన నివేధికను ప్రభుత్వానికి అందించి ఏడాది కాలం గడిచినా ఈ ప్రక్రియ ముందుకు సాగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కరుణాకర్, సువర్ణ, నాగమణి, అనిత, కవిత పాల్గొన్నారు.

## ఘనంగా మానవహక్కుల దినోత్సవం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యునిట్ 1, 2, సామాజిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం మాట్లాడుతూ ప్రపంచ ప్రజల హక్కులను కాపాడడం కోసం ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 10ని మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. భారత పౌరులు స్వేచ్ఛగా హక్కలను అనుభవించే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని దానికి అనుగుణంగా ప్రభుత్వాలు మానవ హక్కులను కాపాడడం కోసం చట్టాలు కూడా చేశాయని, ఎవరూ కూడా ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఎం.అనిత, శ్రీనివాసులు, కిషన్, లక్ష్మీనీలిమా, సునీత, బ్రహ్మం, రాచమల్ల శ్రీను, నరేష్, ఆంజనేయులు, రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు సస్పెన్షన్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** యాదాద్రి డిసిసి ప్రెసిడెంట్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు గార్ల ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పార్టీకి వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన రెబల్ అభ్యర్థులను సస్పెండ్ చేస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి ప్రకటించారు. వారితోపాటు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కడారి రమేష్, గూడపు పాండు, గూడెపు నాగరాజు, మారిశెట్టి మల్లేష్‌లను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక ముందు నుంచి పార్టీ జెండాలను పార్టీ గుర్తులను వాడరాదని స్పష్టం చేశారు. అడ్డగూడూరు మండలంలో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారిని కూడా సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. పిఏసిఎస్ అడ్డగూడూరు చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, అడ్డగూడూరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపెల్లి సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి దండంపల్లి భాను మంజుల సైదులు, మోత్కూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, సీనియర్ నాయకులు వల్లంభట్ల రవీందర్, బొమ్మగాని లక్ష్మయ్య, బాలెంల సురేష్, రాంరెడ్డి, బాలెంల అయోధ్య, బాలెంల మధు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మేకల పవన్, పూలపెల్లి రాజశేఖర్ రెడ్డి, బాలరాజు, జీవన్, వరుణ్ గౌడ్, ఉపేందర్, నవీన్, ఉడుము మల్లేష్, నిఖిల్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా

**ప్రజాపక్షం/మునగాల:** ఆశీర్వదించి ఓటేస్తే బరాఖత్‌గూడెం గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానని టిడిపి, బిఆర్ఎస్ పార్టీలు బలపర్చిన అభ్యర్థి చల్లా గురవయ్య అన్నారు. బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొంతు మోహన్‌రావు, వేనేపల్లి రమేష్ బాబు, కుందురు పుల్లారెడ్డి, కొప్పుల వీరమ్మ, ఎస్‌కె రంజాన్, సిరికొండ వీరయ్య, మోలుగూరి నాగరాజు, సురేష్‌నాయక్, పవన్‌నాయక్, కుమ్మరి వెంకన్న, చల్లా గంగయ్య పాల్గొన్నారు.





## అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/వలిగొండ :** నాపై నమ్మకంతో బ్యాటు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని వరకట్పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి భీమిడి శైలజ లింగారెడ్డి అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను తొలగించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.



## గ్రామాల అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే

**ప్రజాపక్షం/చివ్వెంల :** గ్రామాల అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బొప్పని పుష్పమ్మ దావీదు ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిందన్నారు. గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రచార కార్యక్రమాలు నిషేధం

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో ఈ నెల 14న ఎన్నికలు జరుగనున్న భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల పరిధిలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. 44 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై మండలాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా ఈ నెల 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.00 గంటల నుండి ఎన్నికలు ముగిసే వరకు పై మండలాల్లో మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఈనెల 17న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల సమన్వయ కమిటి తీర్మాణం ప్రకారం మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ప్రకటన చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. సర్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి మైల కళావతి సీతయ్యను ప్రకటించడం జరిగింది. కాని పార్టీ నియమావళికి వ్యతిరేకంగా చింతకాయల వినోద నాగేశ్వరరావు ప్రవర్తిస్తున్నందున మండల కమిటి తీర్మానం మేరకు కాంగ్రెస్ పార్టీ నుండి చింతకాయల వినోద నాగేశ్వరరావులను సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షులు చక్కెర వీరారెడ్డి కోరారు. బుధవారం గోపాలపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని సస్పెండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీకూరి అంజయ్య, శాసనాల నాగసైదయ్య, యంగళ్‌రెడ్డి, రామచంద్రారెడి, బెల్లంకొండ గురవయ్య, కాల్వ రంగయ్య, పెద్ద వెంకటేశ్వరరావు, బందేల్లి, మాసంపల్లి సైదులు, మల్లిఖార్జున్, ఆంజనేయులు,గోవిందరావు, నందిగామ సుందరయ్య పాల్గొన్నారు.





## గ్రామాభివృద్ధే ధ్యేయం

**ప్రజాపక్షం/మునగాల:** నన్ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి పోలంపల్లి స్రవంతి వీరేందర్ లు అన్నారు. మంగళవారం మండలంలోని ఆకుపాముల గ్రామంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటి ముమ్మర ప్రచారం నిర్వహించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో లిక్కి రామరాజు, షేక్ రషీద్, సురగానిసైదులు, ప్రసాద్, పోలంపల్లి వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/కోదాడ:** విశ్రాంత ఉద్యోగుల సంఘం సామాజిక సేవా కార్యక్రమాలలో తమ వంతు సహాయ, సహకారాలను అందిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావేళ్ల సీతరామయ్య అన్నారు. బుధవారం విశ్రాంత ఉద్యోగుల కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్వర్యంలో యాచకులకు, పేదల దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొల్లు రాంబాబు, తిరుపతమ్మ,హాజీనాయక్, శివాజీ, వీరబాబు, రఘువరప్రసాద్, వీరారెడ్డి అహ్మద్, భ్రమరాంబ, విద్యాసాగర్,శోభారాణిలు పాల్గొన్నారు.

## పశువైద్యశాలకు విరాళం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ ప్రాంతీయ వైద్యశాలకు దాత చల్లా వెంకటేశ్వరావు తన కుమార్తె చల్లా తేజస్వినిమాన్వి పేరు మీదుగా బుధవారం రూ॥ 7,200లు విలువగల శాస్త్ర చికిత్స పరికాలను అందించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ వైద్యశాలలో సరైన పరికారాలు లేకున్న డా॥ పెంటయ్య అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తన వంతు సహకారం అందించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా॥ పి. పెంటయ్య, రాజు, చంద్రకళ, అఖిల్, హరికృష్ణ, సాయి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** తనను ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని మేకపాటి తండ కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి భూక్యా రాజు నాయక్ అన్నారు. బుధవారం గ్రామం లో ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్ నాయక్, అజ్మీర్ ప్రభాకర్, సుధాకర్ పాల్గొన్నారు.



# ఐఎన్‌టిఎస్‌ఒలో శ్రీచైతన్య విద్యార్థుల ఘన విజయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష అయిన ఇంటర్నేషనల నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్‌వో)లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరచినట్లు ప్రిన్సిపాల్ కుసుమ బుధవారం తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో సత్తా చాటినట్లు ఆమె తెలిపారు. గణితం, సైన్స్, రీజనింగ్, ఇంగ్లీషు విభాగాల్లో నిర్వహించిన ఈ ఒలంపియాడ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం సుజిత, కోఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపాల్ కుసుమ, డీన్ అల్లావుద్దిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఓటు కోసం వీల్‌చైర్‌లో ప్రచారం



**ప్రజాపక్షం/మోతె :** గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లెల వనిత ఓటు కోసం వీల్‌చైర్‌లో బుధవారం ప్రచారం నిర్వహించారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వనితకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతూ ఈనెల 14 గ్రామంలో జరిగే సర్పంచ్ ఎన్నికల్లో పల్లెల వనిత డిగ్రీ వరకు చదువుకొని ప్రజాసేవ చేయడానికి ముందుకు వచ్చిన ఆమె టూత్‌పేస్ట్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేయాలని గ్రామ ఓటర్లను అభ్యర్థించారు. పంచాయితీ ఎన్నికలు డబ్బు, మద్యం, మాంసం చుట్టూ తిరుగుతున్నాయని మండిపడ్డారు. వనితను గెలిపిస్తే అభివృద్ధికి బాటలు వేస్తామని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, రైతులు, మహిళలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి పల్లెల వనిత, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంజిరాల సుధాకర్, బొల్లం లింగయ్య యాదవ్, నాగమ్మ, జిల్లెపల్లి శివకృష్ణ పాల్గొన్నారు.

# భయపెట్టి నేరాంగీకారం చేయించడం నేరం




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భయపెట్టి, బెదిరించి నేరాన్ని అంగీకరింపజేయడం చట్ట ప్రకారం నేరమని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గ్రీన్ ఉడ్ పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుండి 32 వరకు పౌరులకు ప్రాథమిక హక్కులు లభించాయని వాటికి విఘాతం కలిగించటం శిక్షార్హమన్నారు. జాతి తమ లింగ వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సమాన హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయన్నారు. పౌరులకు లభించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లయితే ఆర్టికల్ 226 ద్వారా రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని, ఆర్టికల్ 32 ద్వారా భారతదేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగిన న్యాయం పొందవచ్చును అన్నారు. ఆరు నుండి 14 సంవత్సరాల వయసు గల బాల బాలికలక నిర్బంద విద్య రాజ్యాంగం ద్వారా లభించిందని, అలాగే చట్టం ముందు అందరూ సమానులే అని చట్టం ఏ ఒక్కరికి చుట్టం కాదని రాజ్యాంగం ద్వారా స్పష్ట పర్చడమైనదని అన్నారు. పౌరులందరికి స్వేచ్ఛ సమాన హక్కులు ప్రసాదింప చేయబడినప్పటికీ సహేతుకమైన కారణాల చేత కొన్ని సందర్భాల్లో ఆంక్షలు విధించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, కుక్కడపు సైదులు, ఎజిపి సురేష్‌కుమార్, న్యాయవాదులు ఎంఎస్ రాఘవరావు, కుక్కడపు బాలకృష్ణ, నారాయణరెడ్డి, సైదా హుస్సేన్, శంకర్‌నాయక్, శ్రీను నాయక్, ఉదారి యాదగిరి, బుడిగ నరేష్, సంధ్యారాణి, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, చైర్మన్ లూర్తు మర్రెడ్డి, ప్రిన్సిపాల్ రాజారెడ్డి పాల్గొన్నారు.

## బందోబస్తు పరిశీలన

**ప్రజాపక్షం/అర్వపల్లి :** నేడు జరగనున్న తొలివిడుత ఎన్నికల్లో భాగంగా మండలంలోని అర్వపల్లి, తిమ్మాపురం, అడివెంల, కుంచమర్తి, జాజిరెడ్డిగూడెం పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా ఎస్‌పి కె నరసింహ పోలింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధుల నిర్వహణ, ఎన్నికల సామాగ్రి భద్రత, ఓటర్ల సదుపాయాల కల్పన పై అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట నాగారం సిఐ నాగేశ్వర్‌రావు, అర్వపల్లి ఎస్ఐ ఈట సైదులు ఉన్నారు.



## స్పీడ్ అందుకున్న ప్రచారం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని గణపవరం గ్రామంలో బుధవారం స్వతంత్ర అభ్యర్థి స్నేహ గ్రామంలోని 2, 3, 4 వార్డు మెంబర్లు మోత్కూరి శ్రీనివాసచారి, ఆత్కూరి స్పందన వీరేష్, పిడమర్తి రమాదేవి వెంకట్రావుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. నాయకులు ఎర్ల శ్రీనివాస్‌రెడ్డి, బండి చిన్నకోటయ్య, లక్ష్మయ్య యాదవ్, గుర్వయ్య, తరుణ్‌రెడ్డి, ధనమూర్తి పాల్గొన్నారు.





## యువత సాయన్నను ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఒక సరికొత్త బహుజన రాజ్యం స్థాపించడానికి ప్రయత్నం చేసిన గొప్ప నాయకుడు పండుగ సాయన్నముదిరాజ్ అని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో సాయన్న వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సాయన్న గ్రామీణ క్రీడల్లో ముందుండేవారని, నిజాం నవాబు, దేశ్‌ముఖ్‌లు చేస్తున్న ఆగడాలపై పోరాటాలు చేశారని, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దొనేటి శేఖర్, బంటు సైదులు, బాషం శ్రీనివాస్, రవితేజ, గణేష్, శివ, వంశీ, హరి, శంకర్, ముని, శివతేజ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే నాయకులను గెలిపించండి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల కోసం పనిచేసే నాయకులకు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండలంలోని తడకమళ్ల గ్రామంలో సీపీఎం బలపరిచిన అభ్యర్థి నగేష్ కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పేద ప్రజల కోసం పనిచేసే సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు చౌగాని వెంకన్న, సైదమ్మ, ఎండి.అంజద్, సోమయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలి



**ప్రజాపక్షం/చివ్వెంల :** కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. చివ్వెంల గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ఇట్టమల్ల శైలజ రాజ్‌కుమార్‌ను కాంగ్రెస్ శ్రేణులంతా అహర్నిశలు పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని మున్యానాయక్ తండలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పఠాన్ సమీర్, మాజీ ఎంపిటిసి మంగమ్మ, గ్రామ ఇంచార్జిలు శబరి, బొడ్డు సాయికృష్ణ, కక్కిరేణి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎస్ఒ టీం తనిఖీలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడమాల్ ప్రధాన రహదారిపై బుధవారం రాజపేట తండా వద్ద ఎఫ్ఎస్ఓ టీం సభ్యులు గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు డిప్యూటీ తహశీల్దార్ నిర్మలాదేవి, శ్రీను నాయక్,జహీరుద్దీన్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి వలసలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి వలసలు వస్తున్నారని సూర్యాపేట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. బుధవారం ధర్మాపురం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 30 మంది నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లికొండ మనోహర్, గుండు పెద్దవెంకన్న, చిన్న వెంకన్న, పొడిశెట్టి జానయ్య, కోక హుస్సేన్, సతీష్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** బాల్య వివాహాలను అరికట్టాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ మండల కమ్యూనిటి సోషల్ మొబిలైజర్ ఒగ్గు సోమన్న పిలుపునిచ్చారు. బుధవారం జల్మలకుంట తండలో వందరోజుల ప్రచార ఉద్యమంలో భాగంగా ఆయన మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నారని ముందస్తు సమాచారం తెలిస్తే వెంటనే 1098కి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జమ్మ, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసి చూపిస్తా



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రజలు ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని మేఘ్యతండ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఆంగోతు రాందాస్ అన్నారు. బుధవారం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. వృద్ధులు, వితంతువులు, అందరికి ఫించన్లు అందించే విధంగా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆంగోతు రెడ్యా, కురువ, సతీష్, లకావత్ గణేష్, ఆంగోతు శ్రీరాములు, ఆంగోతు లక్ష్మి , వీరు, నరేందర్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఓటర్ల ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేయిస్తానని బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పిట్టల అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ వార్డులలో బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 14న జరిగే పంచాయతీ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అమృతం శివకుమార్, పరంకుశం, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ పి ఎల్ 6 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సెకండ్ లీగ్ దశకు చేరిన టీంల మధ్య పోరు ఉత్కంఠ భరితంగా కొనసాగుతుంది.ఈ టోర్నమెంట్ ను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో ఎన్జీ కళాశాలకు తరలివచ్చారు.దీంతో ఎన్జీ కళాశాల ప్రాంగణమంతా క్రీడాభిమానులతో సందడిగా మారింది.సెకండ్ లీగ్ దశలో ప్రతిరోజు మూడు టీంల మధ్య మ్యాచులు కొనసాగుతున్నాయి. సెకండ్ లీగ్ లో గెలుపొందిన జట్లకు ప్రతి రోజు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేస్తున్నారు. గెలుపొందిన జట్లకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ప్రదీప్, ఆర్గనైజర్స్ బోనగిరి తదితరులు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20 వరకు ఎన్ పి ఎల్ 6 క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుందని పేర్కొన్నారు. చివరి రోజు ఫైనల్లో గెలుపొందిన జట్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## పోటీ అభ్యర్థులకు శిక్షణ



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సర్పంచ్ పదవులకు మరియు వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయుచున్న అభ్యర్థులతో ఎన్నికల వ్యయ నిర్వహణ అవగాహన సదస్సు నిర్వహించారు. పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల వ్యయ పరిమితుల లోపలే వ్యయం చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, ఎన్నికల ప్రచారం కోసం చేసే ప్రతి ఖర్చును కొత్తగా తీసిన బ్యాంకు ఎకౌంటు ద్వారానే వ్యయం చేయాలని, ఎన్నికల ముగిసిన 45 రోజుల లోపల నిర్ణీత నమూనాలో ఎన్నికల వ్యయ నిర్వహణ నివేదికను ఎంపీడీవోకి సమర్పించాలని, లేని యెడల గెలిచిన పదవులు రద్దు కావడమే కాకుండా, తదుపరి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కోల్పోతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నిర్వహణ జిల్లా నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, ఎంపీడీవో, ఎంపిఓ, సహాయ ఎన్నికల వ్యయ నిర్వహణ పరిశీలకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల దాడిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి...



**మరో 15 మందికి గాయాలు...**

**ప్రజాపక్షం/నూతనకల్ :** కాంగ్రెస్ నేతల దాడిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి 11 గంటలకు చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మృతుడు ఉప్పల మల్లయ్య (55) కోడలు బిఆర్ఎస్ పార్టీ తరపున వార్డు సభ్యురాలిగా పోటీ చేసింది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం ముగించుకొని రాత్రి తమ పార్టీకి చెందిన కార్యకర్తల ఇంట్లో ఉండి మంతనాలు జరుపుతున్నారు. ఇదే క్రమంలో ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారని ఆరోపణలు చేయగా తిరిగి వారు కూడా ఇదే ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొంటూ గొడవకు దిగారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ళు, కర్రలతో బిఆర్ఎస్ నాయకులపై దాడికి దిగడంతో ఉప్పల మల్లయ్య తలపై దెబ్బ బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడితో పాటు మరో 15 మందికి తీవ్ర గాయాలు కాగా సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. మృతునికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామంలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా ప్రహార కాస్తున్నారు. మల్లయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామానికి తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

## గ్యాస్ పొయ్యి అందజేత

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణం అర్బన్ కాలనీ 1వ వార్డ్ నిరుపేద కుటుంబానికి చెందిన యమల విరికతమ్మకి గత కొన్ని సంవత్సరాల నుండి ఇంట్లో గ్యాస్ పొయ్యి లేక ఇబ్బంది పడుతోంది. మహిళా గ్యాస్ పోయి కావాలి అని మాజీ కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్‌ను అడగడంతో తన పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.6000 విలువ చేసే గ్యాస్ బండ గ్యాస్ స్టవు (పోయి) కనెక్షన్ తన ఫౌండేషన్ వారు ఇంటికీ వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో వస్తువుల అభినేయ, కోట కిట్టు, సాయి మీట్టు చేరన్ పాల్గొన్నారు.






## మానవ హక్కుల దినోత్సవం

**ప్రజాపక్షం/వలిగొండ :** మానవహక్కుల దినోత్సవం సందర్భంగా వలిగొండ మండలం లోతుకుంట మోడల్ స్కూల్లో, మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ ప్యానెల్ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి, బర్ల డేవిడ్, కళాశాల ప్రిన్సిపల్ రహీమున్నీసా బేగం, గణేష్, శ్రీశైలం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరు పెంచిన బిఆర్ఎస్ ప్రచారం



**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి సర్పంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గతంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయానని సింపతి ద్వారా గెలుపొందిన ఇంకా అతనికి అధికారం పై దాహం తీరడం లేదని బీసీ నాయకులకు ఇవ్వాల్సిన చోట ఉద్దేశపూర్వకంగా ఓ సర్పంచ్ అభ్యర్థిగా తన తమ్ముణ్నే పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో వలిగొండ వ్యాప్తంగా ఉన్న బీసీలకు సర్పంచ్ ఎన్నికల్లో స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చిన కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇప్పుడు మాట తప్పి తన కుటుంబ సభ్యులకే అన్ని పదవులు వచ్చే విధంగా ఇలాంటి చర్యలు తీసుకోవడం సిగ్గుమాలిన హీనమైన చర్య అని అన్నారు. వెన్నంటే తిప్పుకొని ఓ బీసీ నాయకుల్ని నట్టేట ముంచారని ఎద్దేవా చేశారు.

## జడ్జి సత్తయ్యకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వలిగొండ :** ఇటీవల రామన్నపేట కోర్టులో సెకండ్ క్లాస్ జడ్జిగా నియమితులైన సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా మునుగోడు మండల వాస్తవ ఆర్ఎంపీ డాక్టర్ నలపరాజు వెంకన్న జడ్జి దంతూరి సత్తయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వలిగొండ మండల ఇన్చార్జి బోడ సుదర్శన్, సిపిఐ వెలిగొండ పట్టణ కార్యదర్శి సెల్వాద్రి రవీందర్, మునుగోడు మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎండి జిలాని మియా, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యుడు చొప్పరి వెంకటేశం, మచ్చ లక్ష్మీ నారాయణ, ఎండి సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డి గెలుపే లక్ష్యంగా...




**ప్రజాపక్షం/మునగాల:** నాగిరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగుల నాగేశ్వరరావు, ఓరుగంటి రవి లు అన్నారు. బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ఉప్పుల నాగిరెడ్డి అత్యధిక మేజార్టీతో గెలిపించాలని 1,2 వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలే సామ్యేలు, డాక్టర్ శ్రీను, షేక్ ఇమామ్‌వలి, ఏనుగుల వీరబాబు, దొంతిరెడ్డి మోహన్‌రెడ్డి, షేక్ పాషా, వార్డు సభ్యులు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, షేక్ యూసఫ్ లు పాల్గొన్నారు.

## పైల్వాన్ పురం గ్రామ అభివృద్ధి లక్ష్యం

**ప్రజాపక్షం/వలిగొండ :** ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని మండల పరిధిలోని పైల్వాన్ పురం బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పైళ్ళ పద్మా మోహన్ రెడ్డి అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని పదవి కోసం కాదు ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వ్యక్తినని అన్నారు. ఈ కార్యక్రమంలో పైళ్ళ మోహన్ రెడ్డి, ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి, బోక్క చంద్రశేఖర్ రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీశైలం రెడ్డి, పాల్గొన్నారు.



# ప్రలోభాలకు లొంగొద్దు




ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: ఈ నెల 11 న జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రతీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తన నివాసంలో స్థానిక సంస్థల ఎన్ని కలపై మీడి యాతో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బాధ్యతగా పోలింగ్ బూత్ కి వెళ్లి ఓటెయ్యాలని, మంచి చేసే నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. మీ తరుపున, మీకోసం ప్రశ్నించే బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు.

# శివన్నగూడెం కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ...



**బిఆర్ఎస్ అభ్యర్థి యాదయ్యకు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గోపాల్ మద్దతు**

ప్రజాపక్షం/మర్రిగూడ: జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. కాంగ్రెస్ నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీటీసీ దాసరి మమతా గోపాల్ బీఆర్ఎస్ అభ్యర్థి లోడే యాదయ్యకు బుధవారం మద్దతు ప్రకటిం చారు. గోపాల్ తన అనుచరులతో కలిసి బిఆర్ ఎస్ ప్రధాన నాయకుల సమక్షంలో మద్దతిస్తున్నట్లు చెప్పారు.

# ఇంటింటి ప్రచారం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : దంతూరు గ్రామ ప్రజలకు గతంలో సర్పంచ్‌గా ఎంపీటీసీగా చేసిన ఎనలేని సేవని అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు సర్పంచ్‌గా గెలిపిస్తారని ఆ గ్రామ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్ అన్నారు. మూడు రోజుల్లో జరగనున్న ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

# ఆర్థిక సహాయం..

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మండలం లోని అన్నెపర్తి గ్రామానికి చెందిన పాలకూరి శ్రీధర్ రెండు పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు.బుధవారం తన వంతుగా రూ. 30 వే ల ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన మామిడి వెంకన్న ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి రూ. 20వేలు అదేవిధంగా తిరుపాల నరసింహ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి,కామల్ల మనోహర్,ఈదుల నర్సిరెడ్డి,జేరిపోతుల పురుషోత్తం, సురేష్,శేఖర్ రెడ్డి,కాశి నాదం, శ్రీనివాస్ రెడ్డి.మామిడి బాబు, పనస సైదులు,పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# తప్పులకు తావు లేకుండా ఎన్నికలు

**నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**




ప్రజాపక్షం/నార్కట్ పల్లి : గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రతి దశలోనూ జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి తో కలిసి నార్కట్పల్లి మండల కేంద్రంలోని శబరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూట్ ,రిసెప్షన్ కేంద్రాన్నిపరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, స్టేషనరీ కిట్లు, పోలింగ్ సిబ్బంది నమోదు ,సామాగ్రి పంపిణీ ,భద్రత చర్యలు, ట్రాన్స్పోర్ట్,కమ్యూనికేషన్ సదుపాయాలు తదితర అంశాలను ఎన్నికల పరిశీలకురాలు, జిల్లా పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీ కిట్లు జాగ్రత్తగా చెక్ చేసుకుని ఒకటికి రెండుసార్లు చూసుకొని, గందరగోళం లేకుండా ఎలాంటి సమస్యలు రాకుండా చెక్ చేసుకోవాలని పోలింగ్ సిబ్బందికి సూచించారు.ఎన్నికల పరిస్థితిని ఎప్పటికప్పుడు సీసీటీవీ ల ద్వారా 24 గంటలు పర్యవేక్షణ చేయాలని,వాహనాలు కదలికలు, ఆలస్యం లేకుండా ట్రాన్స్పోర్ట్ ప్లానింగ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో అపరిచిత వ్యక్తుల కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పి సీఈవో శ్రీనివాసరావు, నల్లగొండఆర్డిఓ వై. అశోక్ రెడ్డి ,తహసిల్దార్ వెంకటేష్ ఎంపీడీవో ఉమేష్ పాల్గొన్నారు.

# నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

**కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



ప్రజాపక్షం/అర్వపల్లి : పోలింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఆయన నాగారం, అర్వపల్లి మండలాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయా డిఆర్సి కేంద్రాలలో కలెక్టర్ మాట్లాడుతూ పిఓలు, ఏపిఓలు పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్‌లను జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలన్నారు. అన్ని సరిగ్గా ఉన్నాయో మరోసారి పరిశీలించుకోవాలని చెప్పారు. గురువారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్నట్లయితే పై అధికారులు అనుమతితో పోలింగ్ నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ తదుపరి మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టాలని, ఓట్ల లెక్కింపులో రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా లెక్కింపు జరుపాలన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప స్టేజ్ 2 రిటర్నింగ్ ఆఫీసర్లు ఫలితాలు వెల్లడించే ముందు జిల్లా ఎన్నికల అధికారి, జనరల్ అబ్జర్వర్ అనుమతి తీసుకొని తుది ఫలితాలు ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్, మండల స్పెషల్ ఆఫీసర్లు శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ బి శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ, ఎంపిఓ గోపి పాల్గొన్నారు.




# మానవ హక్కుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాపక్షం/నలగొండ టౌన్: సమాజంలో మానవులందరికీ సమానమైన హక్కులు ఉన్నాయని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్ .భీమర్జున్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సామాజిక సంక్షేమ హాస్టల్ బాయ్స్ ఎస్సి, డి హాస్టల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమర్జున్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 10 ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం అని మానవులందరికీ సమానమైన హక్కులు ఉన్నాయని ఆయన తెలిపారు.1948లో ఐక్యరాజ్య సమితి మొదటిసారి ప్రకటించిందని అందులో ఒక ముఖ్యమైన సందేశం ఉందన్నారు. మతం, జాతి, భాష, లింగం, కులం లేదా ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ప్రతి మనిషికి గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం పొందే హక్కు ఉందన్నారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మిరియాల లెనిన్ బాబు పారా లీగల్ వాలంటరీ భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించండి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మండల అధినాయకత్వం బలపరిచిన సర్పంచ్ వార్డు అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించాలని పార్టీ నియమాలను ధిక్కరించి వ్యతిరేకంగా పనిచేసే వారిపై మద్దతు తెలపవద్దని పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు 21 గ్రామాల సర్పంచ్ వార్డు అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని బుధవారం ఒక సమావేశంలో తెలిపారు. కష్టపడే నాయకుల పనితీరును అధిష్ఠానం నిశితంగా గమనిస్తుందని భవిష్యత్తులో వారికి మంచి అవకాశాలు కల్పించి ప్రోత్సహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందే అనుకూల పరిస్థితులు ఉన్నాయని పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పోచంపల్లి కోర్ కమిటీ నాయకులు తడక వెంకటేశ్వర్లు, పాక మల్లేష్ యాదవ్, సామ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, భూపాల్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, కాసుల అంజయ్య గౌడ్‌లు పాల్గొన్నారు.

# సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/మోటకొండూర్ : మోటకొండూర్ మండల కేంద్రంలోని మహా లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో రెండవ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా మండలంలో 20 గ్రామపంచాయతీలలో ఎన్నికలలో పోటీ చేయు సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిర, నోడల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, ఎలక్షన్ పోటీ చేసే అభ్యర్థులకు మార్గ నిర్దేశం చేశారు. పోటీల్లో చేసే ఖర్చుల వివరాల పై క్లుప్తంగా వివరించారు. అభ్యర్థులు పెట్టవలసిన ఖర్చు విషయాలు తదితర విషయాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రవణ్ కుమార్, ఉమా శేఖర్, స్టేజ్ టు అధికారులు, పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ అభ్యర్థులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోని 31 గ్రామ పంచాయతీలో ఐదు గ్రామపంచాయతీలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. 26 గ్రామపంచాయతీలకు 77 సర్పంచ్ అభ్యర్థులు, 530 అభ్యర్థులు వార్డు సభ్యులకు పోటీలో ఉన్నారని అధికారులు తెలిపారు. పలు గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం వేగం పుంజుకుంటుంది. ఎన్నికల సందడి మరింతగా కనిపిస్తూ గ్రామ వీధుల్లో, ప్రచార రథాలను తిప్పుతూ ప్రారంభించారు. అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి ప్రతి ఇంటి వద్దకు చేరి సమస్యలు అవసరాలు తెలుసుకుంటూ ప్రజల్లో విశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. పొలాల్లో పని ముగించుకొని ఇంటికి వస్తున్న రైతులకు ప్రత్యేకంగా నిలబడి అభ్యర్థులు అభివాదం చేస్తూ తమ సంకల్పాలు వివరిస్తూ తమ గుర్తులకు ఓట్లు వేయాలని ఓటర్లను కోరుతున్నారు. కోతులాపురం అభ్యర్థి కురుమిద్దె వినోద శ్రీనివాస్, లింగం వారి గూడెం అభ్యర్థి పల్లె సరళ శేఖర్ రెడ్డి, సర్పంచ్ అభ్యర్థులు ఇంటింటా తిరుగుతూ తమ ప్రచారాలను చేస్తున్నారు.

# పద్మమదార్ ప్రచారం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గ్రామ పంచాయతీ వామపక్షాలు, బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చిమట పద్మమదార్ గ్రామంలో ఇంటింటి ప్రచారం బుధవారం ముమ్మరంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ సరస్వతి ఆలయాలు ఉన్న గ్రామాన్ని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. గ్రామాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు చెలిమల పద్మయ్య, వార్డు సభ్యులు ఉప్పుతల మహేష్, నాయకులు పర్వతం లింగయ్య, లక్ష్మీ వీరస్వామి, కుర్ర వెంకన్న, రామరాజు కోటయ్య, సైదులు, రాజుఅశోక్, పి.సైదులు, కృష్ణ, శ్రీపతి సైదులు, పురాణం కృష్ణ, పర్వతం రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బాలయ్య మృతి బాధాకరం

ప్రజాపక్షం/గరిడేపల్లి: తాళ్లమల్లాపురం గ్రామ సిపిఎం సీనియర్ నాయకుడు కోట బాలయ్య మృతి బాధకరమని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ బాలయ్య రెండు సార్లు గ్రామ శాఖ కార్యదర్శిగా, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా పనిచేసి ఎర్రజెండా భుజన వేసుకుని నాలుగు గ్రామాలు తిరుగుతూ ఆయన జీవితం ఎర్రజెండాకు అంకితం చేసిన బాలయ్య మరణం సిపిఎం పార్టీకి తీరనిలోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్కె యాకుబ్, పల్లె వెంకట రెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టికూటి అంజయ్య, హేమగాని వెంకటేశ్వర్లు, తుమ్మల సైదయ్య, ఏనాల సోమయ్య, సీతరాములు పాల్గొన్నారు.



# ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**-పోలింగ్ సరళి పరిశీలనకు కలెక్టరేట్‌లో ఏడు స్క్రీన్లు ఏర్పాటు**
**-360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు**
**-వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తున్న వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఏడు మండలాలకు సంబంధించి జరుగుతున్నాయన్నారు. వీటిలో మొత్తం 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, 1006 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టామని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు మండలానికి ఒకటి చొప్పున కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్‌లో ఏడు స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడత పోలింగ్ ప్రక్రియను కలెక్టర్‌తో పాటు సాధారణ పరిశీలకులు, ఇతర ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించి సజావు ఎన్నికల నిర్వహణకు పర్యవేక్షణ చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో క్రాస్ చెక్ చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు హనుమాచారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు వైరా మండలంలో ఏర్పాట్లు పూర్తి



**-168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**
**-400 మంది ఎన్నికల సిబ్బంది అధికారులు**
**-110 మంది పోలీసులు బందోబస్తు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 18 పంచాయతీలకు గాను 168 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గ్రూపులో పాఠశాల నందు ఉదయం నుంచి పోలింగ్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. అధికారులు ఎన్నికల సిబ్బందికి గ్రామపంచాయతీలు వార్డులు వారీగా కేటాయించి ఎన్నికల సామాగ్రి అందజేశారు. ఈ ఎన్నికల్లో కోసం 350 మంది ఎన్నికల సిబ్బంది 4 జోనల్ ఆఫీసర్, 8 రూట్ ఆఫీసర్, 22 ఆర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో 110 మంది పోలీసులు పాల్గొంటున్నారు. ఇద్దరు పిల్లలు పర్యవేక్షణ, 7 ఎస్సైలు 18 గ్రామపంచాయతీ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయింపు కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకొని ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

# పిండిప్రోలు మేజర్ గ్రామపంచాయతీ పీఠం ఎవరికి దక్కేనో..!









**- అందరి చూపు ఆ గ్రామపంచాయతీ ఎన్నికలపైనే**
**- గ్రామంలో పోటాపోటీగా ప్రచారం**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో మేజర్ గ్రామపంచాయతీ పిండిప్రోలు ఎన్నికలపై మండల ప్రజలంతా ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు. పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎస్సీ మహిళ రిజర్వేషన్ కావడంతో ముగ్గురు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ప్రజాపంథామాస్‌లైన్ అభ్యర్థి ఆరెంపల కేతమ్మ, బిఆర్‌ఎస్ టిడిపి పార్టీలు బలపర్చిన సిపిఎం అభ్యర్థి కామల్ల సువార్త, స్వాతంత్ర్య అభ్యర్థి దార మంగతాయి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ వేసి పోటీలో ఉన్నారు. మొత్తం గ్రామంలో 3537మంది ఓటర్లు ఉండగా పురుషులు 1669 మంది మహిళలు 1868 ఉండగా పురుషుల కంటే మహిళలు 199మంది ఎక్కువ ఉన్నారు. మొత్తం 12 వార్డులు ఉండగా దీనిలో పాపాయి గూడెం ఓటర్స్ కీలకంగా మారనున్నాయి. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40 గ్రామ పంచాయతీల పరిధిలో పిండిప్రోలు గ్రామం 3537మంది ఓటర్లతో మేజర్ గ్రామపంచాయతీగా ఉంది. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న పిండిప్రోలు గ్రామపంచాయతీ ఆదాయం కూడా ఎక్కువే. గ్రామంలో వారపుసంత సుమారు రూ.20లక్షల నుండి రూ.30లక్షలు సంవత్సరానికి పలుకుతుంది. బస్టాండ్ సెంటర్లో పది షాపింగ్ కాంప్లెక్స్ రూములు అద్దెకు సుమారు సంవత్సరానికి రూ4,80,000 ఆదాయం వస్తుంది. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుండి ఎన్నో అభివృద్ధి పనులు గతంలో గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్వహించింది. రాజకీయ చైతన్యం కలిగిన గ్రామ పిండిప్రోలు డిసెంబర్ 14న జరిగే ఎన్నికల్లో మండల ప్రజలంతా పిండిప్రోలు గ్రామపంచాయతీ ఎవరు కైవసం చేసుకుంటారోనని ఎదురు చూస్తున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎసిపి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలో గురువారం జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను వైరా ఇన్‌చార్జి ఎసిపి వసుంధర్ యాదవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, స్థానిక ప్రజలకు, రాజకీయ నాయకులు సమకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మధు, స్థానిక ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్, సిపిఐ(ఎం) వర్గాల మధ్య ఘర్షణ

**- కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవికుమార్‌కు గాయాలు**



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని తొండలగోపవరం గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం వర్గాల మధ్య ఘర్షణ జరిగి ఇరువర్గాల కొట్లాటలో కాంగ్రెస్ నాయకునికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నా యి. తొండలగోపవరం గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం బలపర్చిన బిఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య ఎన్నికల పోటీ తీవ్ర స్థాయిలో ఉండటంతో గురువారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా ఈ కొట్లాటలో కాంగ్రెస్ నాయకుడు అద్దంకి రవికుమార్‌కు తీవ్ర గాయాలై చెయ్యి విరగడంతో వెంటనే మధిరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల మధ్య పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ పడినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. విషయం తెలుసుకున్నా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని పూర్తి బందోబస్తు చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మధిర మండలంలో ఈ సంఘటన చోటు చేసుకోవటంతో సంచలనంగా మారింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మార్కెట్ యార్డ్ పరిధిలోని మెప్మా పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనగోలు కేంద్రాలను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐకెపి, పిఎసిఎస్ సిబ్బందిని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఆత్కూరు చెక్ పోస్టు వద్ద రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చొప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రావు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా

**ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్, రాష్ట్ర నేత దయానంద్ ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త కారాయిగూడెం పంచాయతీ కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి కర్రి సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కర్రి సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కొత్త కారాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రచారంలో సర్పంచ్ గా గెలిపించి గ్రామ పంచాయతీ సేవ చేసే భాగ్యం కలిగించాలని ప్రజలను కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజిలు ఇందిరమ్మ ఇండ్లు, మంచినీటి సదుపాయం వంటి అభివృద్ధి పనులు పరిష్కరిస్తామని, గ్రామంలోని పారిశుద్యం నిర్మూలించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో నిజాయితీకి, నిబద్దతకు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సత్యనారాయణ కోరారు.

## తిప్పనపల్లిలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధారావత్ రామారావు ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఉచిత బస్సు ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇల్లు సన్న బియ్యం తదితర సంక్షేమ పథకాలు చూసి ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మెజార్టీ ఏ లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేస్తున్నారన్నారు. మహిళలు ఇందిరమ్మ చీరలతో ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.